# వంశోద్ధారకుడు

అతివృష్టినీ, అనావృష్టినీ కూడా చలమయ్య తన జీవిత కాలంలోనే అనుభవించాడు. పెళ్ళయిన మూడు నాలు గేళ్ళదాకా ఆయనకు సంతానం కలగలేదు. కలగనందుకు, చలమయ్య విచారించకపోలేదుగానీ, అంతకన్నా ఆయన తల్లి గారు విచారించారు. మనవల సంతానాన్ని చూడాలని ఆమె ప్రాణం తల్లడిల్లిపోయింది. నాలుగేళ్ళ పాటు కోడలు ఉదయంపూట వాంతులు చేసుకుంటుందేమోనని ఆవిడ ఎదురుచూసింది. బియ్యం పోగుచేస్తూ, బాగుచేస్తూ మట్టి బెడ్డలు నోట వేసుకుంటుందేమోనని, ఆశపడింది. ఇదేమీ జరగలేదు. ఆవిడ చాటునా మాటునా కొడుకు ఇంకో పెళ్ళి చేసుకుంటేనన్నా వంశం నిలబడుతుందేమోనని అన్నమాట నిజమే... చలమయ్య దాని కొప్పుకోలేదు. నరసమ్మ ఏ మాటా అనకుండా గుడ్లనీళ్ళు గుడ్ల కుక్కుకొంటూ వెళ్ళి పోయేది.

ముసలమ్మ జారిపోయిన ఏడాదిలోపుగానే నరసమ్మ నీళ్ళుపోసుకొంది. చలమయ్యకు సంతోషమూ విచారమూ

కూడా ఒక్కసారే కలిగాయి. ఈ గొడవేదో తన తల్లి బతికుండగానే జరిగున్నట్లయితే, ఆవిడ అంత గుండె దిగులుతో మరణించక పోను. కనీసం ఇప్పటికయినా భగవంతుడు యీపాటి కరుణించినందుకు చలమయ్య సంతోషించాడు.

నోరు విప్పి అనలేదన్న మాటేగానీ, ఈ నాలుగేళ్ళపాటూ నరసమ్మ నరకయాతన అనుభవించింది. తన ఈడు వాళ్లు పిల్లాజల్లాతో కళకళలాడుతుంటే, తను ఎందుకిట్టిలా ఉండిపోవలసి వచ్చింది. తన కారణంగా, ఆ వంశం అంతటితో అంతరించిపోతుందేమోనని కూడా నరసమ్మ భయపడింది. పోనీ ఆయన మరో పెళ్ళి చేసుకొంటేనన్నా బాగుండునేమోననీ, చాలాసార్లు అనుకొన్నది. కానీ ఇదేమీ జరగలేదు.

అందరూ అనుకొన్నట్టు నరసమ్మకు మగ నలుసు కలుగలేదు. ఆడపిల్ల పుట్టింది. తను ఆడదయి ఉండికూడా, తనకు ఆడపిల్ల పుట్టినందుకు నరసమ్మ ఏమాత్రమూ కించపడకపోలేదు. చలమయ్య ధోరణి మరోలాగా ఉన్నది.

"మగ వెధవ ఉద్ధరించేదేవిఁటి – ఆడపిల్ల ఉద్ధరించనిదేవిఁటి? అందరూ ఒకటే! అదీగాక – అందరూ మగపిల్లలేన్నకంటే, ఈ తరంతో సృష్టికాస్తా ఆగిపోదా మరి" – అన్నాడాయన, అలా ఆగకుండాఉండేందుకే తను ఆ పిల్లను కన్నవాడిలాగా పోజుపెడుతూ. ఏ మాట కామాటే చెప్పుకోవాలి; తొలిచూలు దానికి తల్లి పేరు పెట్టుకొంటాననని, చలమయ్యన్న

ప్పుడు నరసమ్మ కాదనలేదు. దిక్కుమాలిన పేరు ఎవరి దుంటేనేంగాక, బిడ్డ తనబిడ్డే! ఈ కానుపే మరో నాలు గేళ్ళకిందట జరిగినట్లయితే తనాపాటి రంపపుకోత కూడా పడ వలసి వచ్చేదికాదు. కానీ, భగవంతుడు ఒకలాగా తలిస్తే మరోలాగ యెలా అవుతుంది గనక ?

సుమతికి రెండేళ్ళు వెడతాయనగా నరసమ్మ మళ్ళా వాంతులు చేసుకోసాగింది. చలమయ్య ఎవ్వరికీ చెప్పకుండా సిద్ధాంతిగారిని ప్రశ్న అడిగొచ్చాడు. ఐదు రూపాయలు, బుట్టెడు కూరగాయలు అందుకొని, 'వంశోద్ధారకుడు పుడ తాడు పొమ్మ'న్నాడు సిద్ధాంతిగారు. చలమయ్య గుండెల్లో పాలకుండలు విడిలిపోయినట్లయింది.

దురదృష్టవశాత్తూ సిద్ధాంతిగారిమాట నిజం కాలేదు. నరసమ్మకు ఈసారీ ఆడపిల్లే పుట్టింది. మూడోకాన్పులో గానీ, చలమయ్యకు మగనలుసు కలగలేదు. ఆ రోజున ఊరంతకీ ఆయన భోజనాలు పెట్టాడు. మందిలో కూచుని తిననివాళ్ళ ఇళ్ళకు, స్వయంపాకాలు పంపించాడు.

పువ్వుల్లో పెట్టి పెంచడమన్న సామెతను అక్షరాలా నిజం చేశాడు చలమయ్య. అసలే లేకలేక కలిగిన సంతానం! దానికితోడు ఇద్దరు ఆడపిల్లల తరవాత పుట్టిన మగ నలుసు గనక వెంకటేశ్వర్లు పెంపకం మహా అపురూపంగా జరిగి పోయింది. వాడికన్నా పెద్దవాళ్ళిద్దరున్నా, వారసులు లేన ట్టుగానే అనిపించేది చలమయ్యకు. ఇవ్వాళ గాకపోతే రేపో

మెల్లుండో ఆ ఇద్దరూ, ఈ ఇల్లొదిలి, వెళ్ళిపోయేవాళ్ళే... ఈ గడ్డనే వుండి ఇక్కడే పెరిగి, తనకిన్ని తులసి నీళ్ళొదిలే వాడు వెంకటేశ్వర్లొక్కడే !

అందరు పిల్లల్నీ పంపినట్టు చలమయ్య తన కొడుకును వీధి బళ్ళోకి పంపలేదు. ఆ పంతుల్నే ఇంటికి పిలిపించి చదువు చెప్పించాడు. అవసరమయితే మరో రూపాయి డబ్బులు పారేస్తానన్నాడు. కుర్రవాణ్ణి కసరటానికీ, గదమాయించటానికీ వీల్లేదన్నాడు. అసలు ఇవన్నీ ఉంటాయి గనకనే, తను కొడుకును, వీధిబళ్ళోకి పంపడం మానేశానన్నాడు. ఆడపిల్లల్ని మాత్రం, మామూలుగా అంజయ్య పంతులుగారి బళ్ళోకే పంపుతున్నాడు.

చిరంజీవి వెంకటేశ్వర్లుగారికి అక్షరాలు ఓ పట్టాన రాలేదు. వాడు తిన్నగా కూచునేవాడుకాదు. కూచున్న కాస్సేపయినా అ ఆ ఇ ఈ లు దిద్దేవాడుకాదు. 'అదేమీ' అని కోప్పడ లేదు. కళ్ళెర్రజేయడానికీ లేదు. గీతమీద బలపం పెట్టి పక్కకు తొలగకుండా దిద్దమని ఒకసారి పంతులు కాస్తంత గొంతు పెంచి అన్నాడు. వెంకటేశ్వర్లు బలపాన్ని విరిచి పారేసి, పలకను కాళ్ళతో మట్టగించి, గావు కేకలు పెడుతూ లోపలికి పారిపోయాడు. ఆ రోజున నరసమ్మకూడా కాస్త నోరు జేసుకొన్నది.

దిక్కుమాలిన తెలుగక్షరాలు అన్ని లేకపోతే నేమన్నదావిడ. అన్ని వంకలూ మెలికలూ లేకుండా, అలా చూడం

గానే గుర్తుంచుకోనేలాగా ఉంటే ఎంతో బాగుండునని అన్నది. ఇంతకన్న తక్కువ అక్షరాలుండి సులభంగా వచ్చే చదువేమన్నా ఉంటే అదే వాడికిచెప్పమన్నది.అప్పటికిమేష్టరు గారేమీ అనలేదు; మళ్ళా ఆ కొంపచాయలకు రానూలేదు.

వెంకటేశ్వర్లు ఈడువాళ్ళు మెట్రిక్ చదువుతున్న సమయాన, అతగాడు ఫస్టుఫారంలో వున్నాడు. ఉన్నాడంటే వాడి ప్రతిభవల్ల ఉండడంకాదు. బడితకుమల్లే ఎదిగినవాణ్ని అయిదో తరగతిలోనో, నాలుగో తరగతిలోనో కూచోబెట్ట డానికి టీచర్లే సిగ్గుపడ్డారు. ఇదేమీ కాదనీ తను ట్యుటోరి యల్ కాలేజీలో చేరి, చదువుతాననీ చలమయ్యగారి ఆరో ప్రాణం అన్నది. ఆయన మరో ఆలోచన లేకుండా దాని కొప్పుకున్నాడు. ఉన్న వూళ్ళో ఆరోప్రాణం చెప్పిన బాపతు కాలేజీలేదు. అందుకు గుంటూరు పంపించాడు. అక్కడ మంచి గది — పది రూపాయలు పోతేనేం గాక — మాట్లా డాడు చలమయ్య. ఉదయం, సాయంకాలం గది వూడవ టానికీ రెండు పూటలా క్యారియర్ తెచ్చిపెట్టడానికీ, పని కుర్రాణ్ణి కూడా కుదిర్చి మరీ వచ్చాడు. డబ్బుకు ఇబ్బంది పడొద్దనీ వాణ్ణీ వీణ్ణీ పైసాకూడా అప్పులు అడగొద్దనీ ఉత్త రం రాసే వెసలుబాటుకూడా లేనప్పుడు సరాసరివచ్చి, కావల సిందేదో పట్టుకెళ్ళమనీ చలమయ్య తన ఆరో ప్రాణానికి పదే పదే చెప్పాడు. గది విడిచి మూల తిరుగుడు తిరిగేటప్పుడు చలమయ్య గుండెలు గతుక్కు లాడాయి. మూలమీద వంతెన పక్క నిలబడి కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడాయన పాపం!

ఇంటికి తిరిగొచ్చాక, ఆయన ఆడపిల్ల లిద్దరి చదువూ మానిపించేశాడు. అసలు ఆడవాళ్ళ చదువు కిందపెట్టిన ఖర్చంతా వృథాయేనన్న నమ్మకం, ఆయనకు మొదట్నించీ ఉన్నది. పోనీ అదే కారణం కాదనుకొన్నా - ఒక చెంప కుర్రాడు పట్నంలో చదువుతున్నాడు, వాడికి అటూయిటూగా నెలకు వందరూపాయలదాకా అవుతున్నాయి. దానికితోడు ఈ పిల్లలిద్దరికీ జీతాలు, పుస్తకాలు, కలాలు, కాగితాలు ఎంత ఖర్చు? యెంత దండగ?

మరో సంగతేమిటంటే, ఆడపిల్లలు చదువుతున్న కొం దికీ అంతకన్నా పై చదువులు చదివిన వాళ్ళను మొగుళ్లుగా కోరుకుంటారు. పై చదువులు చదివిన అబ్బాయిలు చాలా డోలీ కట్నాలకు రారు. అయినప్పుడు – ఆడాళ్ళ చదువుల కింద బోలెడంత ఖర్చుపెట్టడమూ, అంతకు పదిరెట్లూ పది హేను రెట్లూ కట్నాలిచ్చుకోవటము తెలివితక్కువ గాదా మరి?

వెంకటేశ్వర్లు మూడు నాలుగేళ్ళపాటు బస్తీలో ఉన్నాడు. ఈలోగా చలమయ్య ఆరువేల రూపాయలదాకా అప్పుచేశాడు. వెంకటేశ్వర్లుకు చదువేమాత్రం వచ్చిందీ తెలీదుగానీ – వాడికి ఇతర లక్షణాలు చాలా అబ్బినాయి. ఉదయం లేస్తూనే ముఖమన్నా కడుక్కోకుండా కాఫీ తాగే వాడు. బ్రష్‌తోగానీ పళ్లు తోమేవాడుకాదు. గుడ్డనలిగినా, బూట్లకు రవంత మచ్చపడినా గిల గిల్లాడిపోయేవాడు. సిని

మాలు చూడందే నిద్రరాదనేవాడు. అంత మాత్రంగా అసులుసులుగా గుడ్డలుండే ఆడబొమ్మలున్న పత్రికలు, పుస్తకాలు చదివేవాడు. పెట్టె అర్ధరూపాయకు తక్కువగాని సిగరెట్లు రోజుకు నాలుగైదు పెట్టెలు వూదేసేవాడు.

"ఇదేమిట్రా" అని చలమయ్య అడగలేదు. అడగడానికి ఆయనగారు అక్షరాలా భయపడిపోయాడు.

ఎవరో వచ్చి 'నీ కొడుకు మూడు ముక్కలాడుతున్నాడయ్యా' అన్నాడు చలమయ్యతో. ఆయన ఓ నిమిషం పాటు కొయ్యబారి పోయాడు.

అన్నాల దగ్గర కూచున్నప్పుడు ఈ సంగతి ఎత్తుదామనుకున్నాడు చలమయ్య. భార్యవేపు చూశాడు. కొడుకు చూడకుండా, అడగొద్దన్నట్లుగా నరసమ్మ సైగచేసింది. చలమయ్య మళ్ళా కిక్కురు మనలేదు.

ఆయన మనసులో ఏమున్నదో ఎవరికీ తెలీదు. ఆ ఏడే ఇద్దరు కూతుళ్ళకూ పెళ్ళిళ్లు చేశాడు. నిజానికి రెండు సంబంధాలూ మంచివే. వాళ్ళు కాస్త బెట్టుచేసినట్లయితే కట్నాలుకూడా బాగా వచ్చేవే. కానీ కట్నం డబ్బుకోసమని బంగారబ్బొమ్మల్లాంటి అమ్మాయిల్ని వొదులుకోడానికి అవతలవాళ్లు సిద్ధంగా లేరు. చలమయ్య రొట్టె కాస్తా నేతిలో పడ్డది.

పెళ్ళికి పదిరోజులు ముందుగా రమ్మని రాశాడు చలమయ్య. ఆయనగారి ఆరోగ్ప్రాణం సరిగ్గా పెళ్ళిరోజుకొనీ

దిగలేను. వస్తూనే నానా అల్లరీ చేశాడు. ఈ పందిళ్ళూ, మేళాలూ మంత్రాలూ అంతా బార్బరస్ అన్నాడు. అంటే ఏమిటో చలమయ్యకు చచ్చినా తెలీదు.

పెళ్ళికొడుకులిద్దరూ తర్లి వచ్చారు. వాళ్ళకి ఇహ జీవితంమీద విసుగొచ్చి కాశీకి ప్రయాణమయితే, వెంకటేశ్వర్లొచ్చి, తన తోబుట్టువునిచ్చి పెళ్ళిచేస్తానని, ఈ ప్రయాణం మానుకోమనీ అడగాలి. వాడు మూలగదిలో మారుమూలన వున్నాడు. ఎదురుగా రెండు సీసాలు, గ్లాసులు కనిపించాయి. గదంతా వెగటు వాసనతో గుప్పుమంటున్నది. చలమయ్య తన ఆరో ప్రాణంకేసిచూశాడు. వాడికి వొంటిమీద స్పృహ లేదు. గభాలున తలుపులు వేసి చక్కా ఇవతలకొచ్చాడు.

పందిట్లోంచి ఝుమ్మని మేళాలు వినిపిస్తున్నాయి.

ఆయన ఉయ్యాలబల్ల దగ్గర కూలబడి బావురుమని ఏడ్చాడు. నరసమ్మ దగ్గరకొచ్చి, "కుర్రవెధవ, పోనియ్యవయ్యా!" అని సర్దబోయింది. తను వంశోద్ధారకుణ్ణి గురించి విచారించడం లేదనీ ఆడపిల్లలకు అన్యాయం చేసినందుకే కుళ్ళిపోతున్నాననీ చలమయ్య అనలేదు.

కుందనబొమ్మల్లా, ఓ పక్కగా నిలబడిన ఇద్దరు కూతుళ్ళకేసి చూస్తూ, ఆయన పెళ్ళి పందిట్లోకి వెళ్ళిపోయాడు.